


13



వంగూరి చిట్టెన్ రాజు

## అమెరికాలక్షేపం

# యెస్పీలూ, డబుల్ యెస్పీలూ కధ

మా చిన్నప్పుడు ఎస్పీ అంటే మా అమ్మమ్మ భాషలో పోలీసు సూపర్నెంట్. ఈ రోజుల్లో యెస్పీ అంటే సుప్రసిద్ధ సినీ గాయకుడు, మిత్రుడు యెస్పీ బాలసుబ్రమణ్యం అనే చాలా మందికి అర్ధమయ్యే మాట. అమెరికా పరిభాషలో ఈ రెండు అర్ధాలూ, అనుకోవడాలూ తప్పే. ఎందుకంటే ఈ యెస్పీలూ, డబుల్ యెస్పీలూ గత రెండు, మూడు దశాబ్దాలుగా అమెరికాలో పుట్టుకొచ్చిన సరి కొత్త తెలుగు జాతులు. చిన్నప్పుడు మా కాకినాడలో ఎమ్మేలూ, డబులెమ్మేలూ చాలా మంది ఉండే వారు. పాపం వారంతా తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ ఎమ్మే డిగ్రీలు చేసి పండితులుగా చెలామణీ అయ్యే వారు సంఘంలో. ఈ అమెరికా యెస్పీలు చెలామణీ అయే పధ్ధతి మాత్రం అది కాదు.

ఉదాహరణకి, మా ఊళ్ళో యెస్పీ గారున్నారు. ఆ మాట కొస్తే, అమెరికాలో ప్రతీ ఊళ్ళోనూ ఒకరో, ఇద్దరో యెస్పీగాళ్ళు గ్యారంటీగా ఉంటారు. ఈ యెస్పీగాళ్ళు సాధారణంగా ప్రతీయేడూ ఉగాది టైములో అర్జంటుగా లేచి కూచుంటారు. కొత్త తెలుగు సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఒక కవిత రాసి, పారేసి జనం మీదకి ఒదిలి పారేస్తారు. మా ఊరి యెస్పీ గారు అలా రాసి పారేసి, విసిరేసిన కవిత ఇలా ఉంది.



పొమ్మా, పొమ్మా, ఓ తారణ నామ సంవత్సరమ్మా,
రమ్మా, రమ్మా, ఓ పార్ధివ నామ సంవత్సరమ్మా.
తెమ్మా, తెమ్మా, నా బేంకు నిండుగా డాలర్ సొమ్మా, సొమ్మా
లేదా, నువ్వు కూడా అర్జంటుగా పారిపొమ్మా, ఓ పార్ధివమ్మా...

ఈ తరహాలో శ్రీవారు నాలుగైదు పద్యాలు వ్రాసి అందరినీ ఆనందింపజేశారు. ఇంత వరకూ బాగానే ఉంది కానీ, ఈ కవి వర్యులకి ఒక సిద్ధాంతం ఉంది. స్టేజి మీద శుద్ధ తెలుగులో తను బాగా మాట్లాడగలడు. కాబట్టి తనొక్కడికీ నాలుగైదు గంటలు టైమిచ్చి, ఇక మిగిలిన ముప్ఫై నిముషాల ఆరు సెకన్లూ, ఎవరూ విని చావని ధన్యవాదాలు అనగా వోట్ ఆఫ్ థేంక్స్ లాటివి మిగిలిన బడుద్ధాయిలందరూ చెప్పాలి అని ఈ యెస్పీ గారి సిద్ధాంతం. ఒకానొక సభలో అలా ధన్యవాదాలు చెప్పే డ్యూటీ ఈయనకే పడింది. పాపం నాలుగు పేజీలు తెలుగింగ్లీషులోనూ, ఇంగ్లీషు తెలుగులోనూ, వ్రాసుకుని, పేజీకి ఒక రోజు చొప్పున నాలుగు రోజులు రిహార్సల్స్ వేసుకున్నారు శ్రీవారు. ఆ రోజు హాలు శుభ్రం చేసిన ఫెర్నాండెజ్ కుటుంబానికీ, మైకులు ఎవరికీ వినబడకుండా ఎరేంజ్ చేసిన కణ్ణప్పన్ కీ, అందరి కంటే ముఖ్యంగా తను ఇంత కష్టపడి సేవ చేస్తుండగా తనని ఎంతో అర్ధం చేసుకుని సదరు సేవని నిరాఘాటంగా సాగనిచ్చిన, అర్ధాంగి, కూతురు, కొడుకు, పక్కింటి జాన్సన్ మరియు మిసెస్ జాన్సన్ మొదలైన వారందరికీ ఎంతో ఘనంగా, ఆవేశంగా శ్రీ యెస్పీ గారు ధన్యవాదాలు తెలుపుతూ ఉండగానే అందరూ లేచి భోజనాల హాలు లోకి వెళ్ళిపోయారు, ఒక్క కణ్ణప్పన్ తప్ప.

ఇక రెండో రకం వారు డబుల్ యెస్పీలు. అంటే యెస్పీ, యెస్పీలు. ఉన్న మాట చెప్పొద్దూ, పైన చెప్పిన సింగిల్ యెస్పీలు సంఘాన్ని బోరు కొట్టి చావకొడతారు కానీ పెద్దగా హాని చెయ్యరు. ఏదో వాళ్ల ప్రపంచంలో వాళ్ళు బతుకుతారు. కానీ ఈ రెండో రకం డబుల్ యెస్పీలు ఒక మాఫియా గాంగ్ లాటి వాళ్లు. వాళ్ల దృష్టిలో ఆ గేంగ్ సభ్యులే కథ కమామీషూ, కవితలూ మొదలైన చాలా హై లెవెల్లో వ్రాయగలరు. అంతకంటా ముఖ్యం, మిగిలిన వాళ్ళు వ్రాసినవి వారి ఎవాల్యూషన్‌లో ఉన్నత సాహిత్య పరిమాణాలని అందుకోవు. మామూలు మాటలలో చెప్పాలంటే గేంగ్ వారు వ్రాసినవే, పొగిడినవే ఉన్నత సాహిత్యం. మిగిలినదంతా "బిలో క్వాలిటీ". ఇలాంటి గేంగులు ఏ కారణానికి మొదలైనా, ఎంత మందితో మొదలైనా అవి సాధారణంగా, క్రమ క్రమంగా ఒకే కులం వాళ్ళు డామినేట్ చేస్తారు. అఫ్ కోర్స్ ఆటలో అరటి పండులాంటి వాళ్ళు ఎప్పుడూ ఉంటారనుకోండి.

ఈ గేంగ్ సభ్యుల ప్రథమ లక్షణం ఏమిటంటే పరస్పర డబ్బా. అంటే ఒకాయన కథ ఇండియాలో ఎక్కడైనా పడిందనుకోండి. మరొకాయన దాన్ని పొగుడుతూ ఆ వార్త డప్పు కొడతాడు. తదుపరి ఈ మరొకాయన కవిత మరొక చోట పడగానే మొదటాయన ఆ శుభ వార్త దండోరా వేస్తాడు. ఈ రెండు వాయిద్యాలకీ మధ్య మిగిలిన వారి కవితలూ, కథలూ ఎన్ని ఎక్కడ పడినా ఎక్కడా చప్పుడవదు. అదే గేంగ్ మెంటాలిటీ అంటే.

వీళ్ల మూలాన జరిదేమిటంటే ఏదైనా వ్రాద్దామనుకునే వాళ్ళకి ప్రోత్సాహం బదులు నిరుత్సాహం పుట్టుకొస్తుంది. నాకు ఆశ్చర్యం ఏమిటంటే ఈ క్వాలిటీ సాహిత్యం గేంగ్‌లని నేను ఇండియాలో చూడలేదు.

అన్నట్టు అమెరికా నిండా వ్యాపించిన యెస్పీ అనగా "స్వయం పట్టాభిషిక్తులు" అనియూ, డబుల్ యెస్పీ అంటే యెస్పీయెస్పీ అనగా "స్వయం ప్రకటిత సాహితీ పెత్తందార్లు" అనియూ అర్ధం.

ఇదంతా కంప్యూటర్‌లో టైపు కొట్టి ముగింపు ఎలా చేద్దామా అని అనుకుంటూండగా మా శ్రీమతి తన అర్ధరాత్రి షిఫ్ట్ కి ఉద్యోగానికి వెళ్ళిపోతూ "ఏమిటీ, ఇంత రాత్రి మళ్ళీ ఏమన్నా చెత్త రాస్తున్నావా?" అంటూ వచ్చింది.

"నేనా, చెత్త రాయడమా ? నువ్వేమన్నా డబుల్ యెస్పీవా ఏమిటి?" అన్నాను.

"సింగిల్, డబుల్‌యెస్పీ అంటూ ఏమిటా మాటలు, నీ తలకాయ" అంది మా ఆవిడ. నా మీద అనుమానం వచ్చినప్పుడల్లా ఎందుకో నా తలకాయ మీద మా ఆవిడకి అనుమానం వచ్చేస్తుంది.

"కొత్త మాట కాదులే అలాంటి వాళ్ళ మీద ఏదో చిన్న అమెరికాలక్షేపం చేశాను. కావాలంటే చదువు" అన్నాను.

"నేనా, ఇప్పుడా, వర్క్‌కి టైం అయిపోతోంది" అని, కుతూహలం ఆపుకోలేక టక, టకా చదివేసింది మా ఆవిడ నా వెనకాలే నుంచుని కంప్యూటర్ స్క్రీన్ మీద ఉన్న ఈ వ్యాసాన్ని.

అంతా చదివాక "ఓస్ ఇంతేనా, నేను వెళ్ళాలి, అన్నట్టు అర్జంటుగా వెళ్ళి అద్దంలో నీ మొహం చూసుకో. ఎవరు కనపడ్డారో నాకు ఫోన్ చేసి చెప్పు" అంది మా అర్ధాంగి.

"ఎవరు కనపడ్డం ఏమిటీ?` అన్నాను ట్యూబు లైటు వెలక్క..

"అదేలే, నీ తలకాయ, సింగిల్ యెస్పీ కనపడ్డాడా, డబుల్ యెస్పీ గేంగ్ లీడరు కనపడ్డాడా" అని నవ్వుతూ ఆఫీసుకి పారిపోయింది మా ప్రేయసి.

  